క్లుప్తంగా

ఉమామహేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జ్యోతినగర్: శ్రీఉమామహేశ్వర స్వామి వార్షికోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని వైకుంఠపురం హరిహర దేవాలయంలో కొలువుదీరిన ఉమామేశ్వర స్వామికి నిత్యపూజాభిషేకార్చన, జప పారాయణ, రుద్రాభిషేకం, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జూలపల్లి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద జూలపల్లి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు అనుమతి పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు అందరూ అనుమతి పత్రాలను కలిగి ఉండాలని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ఠాణాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్‌కు సీఎంఆర్‌ఎఫ నుంచి మంజూరైన చెక్కును గురువారం అందజేశారు. రోడ్డు ప్రమాదానికి గురైన ఇంతియాజ్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. వైద్యఖర్చుల నిమిత్తం జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన రూ.41,50 విలువ గల చెక్కును టీఆర్‌ఎస్ గ్రామ నాయకులు అందజేశారు. కన్నాల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కుడిక్యాల సురేశ్, మాజీ చైర్మన్ మల్క రామస్వామి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఫీట్ల గోపాల్, పుప్పాల దయానందం, ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


పీఏసీఎస్‌కు వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై అందించడానికి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుమిత్ర తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన విత్తనాలను ఆమె పరిశీలించారు. పచ్చిరొట్టు విత్తనాలు తీసుకునే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులతో వచ్చి తీసుకోవాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

రామగుండం: నగరంలోని ఇండస్ట్రియల్ ట్రేనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లో 2023–24వ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రతినిధి తెలిపారు. ఎలక్ట్రీషియన్-20, ఫిట్టర్-20, సివిల్-24, కోపా-24, డీజిల్ మెకానిక్-24 సీట్లు ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు తమ ధ్రువపత్రాలతో iti.telangana.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సిండికేట్‌గా మారిన ఫర్టిలైజర్ వ్యాపారులు

మంథని: మంథని నియోజకవర్గంలో ఫర్టిలైజర్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండె రాజయ్య ఆరోపించారు. అధిక ధరలకు పత్తి విత్తన ప్యాకెట్లు అమ్ముతున్నప్పటికీ.. వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం పత్తిగింజల తయారీ యాజమాన్యాలతో కుమ్మక్కు అయిందని ఆయన విమర్శించారు.

రెట్టింపైన కూరగాయల ధరలు

- సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థికభారం
- అధిక వర్షాలు, దిగుబడి తగ్గడమే కారణం: వ్యాపారులు


కూరగాయలు కొంటున్న వినియోగదారులు

జ్యోతినగర్: ఎండలు ఎలా మండుతున్నాయో అదే మాదిరి కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ప్రధానంగా టమాట, మిర్చితో పాటు ఇతర కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో వాటికి డిమాండ్ అధికంగా ఉంటుంది. అందుకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. అన్ని కూరగాయల ధరలు, ఆకు కూరల ధరలు ఒక్కసారిగా పెరగడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు భయపడుతున్నారు. కూరగాయల ధరలు చూసి అమ్మో అంటున్నారు.

పెరిగిన కూరగాయల ధరలు..

ప్రస్తుతం టమాట కిలో రూ.50 రూపాయలు మిర్చి కిలో రూ.180, వంకాయ కిలో రూ.60, బీరకాయలు కిలో రూ.100, చిక్కుడుకాయలు కిలో రూ.80, బెండకాయలు కిలో రూ.60, కాలిఫ్లవర్ కిలో రూ.60, దొండకాయలు కిలో రూ.60 రూపాయలు, కాకరకాయ కిలో రూ.80కు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలు వినియోగదారుడికి భారంగా మారుతున్నాయి. అకాల వర్షాలు, దిగుబడి తగ్గడం వంటి కారణాలతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెప్తున్నారు.

అదనపు భారం పడుతోంది



కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో నెలవారీ బడ్జెట్ పెరిగిపోయింది. ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. ధరలు చూస్తే కొనుగోలు చేయడానికి భయమేస్తోంది. ముఖ్యంగా టమాట, మిర్చి ధర అందుబాటులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతున్నాం.

– రాజ్‌కుమార్, జంగాలపల్లి

రేట్లు రెట్టింపు అయ్యాయి



వంటకు కావాల్సిన ప్రతి వస్తువు ధర రెట్టింపు అయ్యింది. నిత్యావసర సరుకులు ఒకదానికి ఒకటి పోటీ పడుతున్నట్లు ఉంది. కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో నెలరోజులకు అయ్యే వంటింటి ఖర్చు ప్రస్తుతం పది రోజులకు కూడా సరిపోవడం లేదు. ఆర్థిక భారం మోయాల్సిన దుస్థితి నెలకొంది.

– భాగ్య, గృహిణి, నర్రాశాలపల్లి

తాగునీటి కోసం మహిళల ఆందోళన

- బిందెలు, ప్లాస్టిక్ బకెట్లతో నిరసన


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు, కార్పొరేటర్

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో తాగునీటి కోసం గురువారం సాయంత్రం డివిజన్ ప్రజలు ఆందోళన చేశారు. స్థానిక ఫైవింక్లయిన్ రోడ్డులోని కృష్ణానగర్ ప్రధాన రహదారిపై స్టీల్ బిందెలు, ప్లాస్టిక్ డబ్బాలతో మహిళలు నిరసన తెలిపారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆందోళనకారులకు డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి సంఘీభావం తెలిపి, నిరసనలో పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలు నీటి సమస్యపై అనేకసార్లు నగర మేయర్, కమిషనర్‌తోపాటు సింగరేణి జీఎం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి నుంచి స్పందన లేదని అసహనం వ్యక్తం చేశారు. డివిజన్‌కు క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేయడం లేదని, మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారన్నారు. విషయం తెలిసిన వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని డివిజన్ వాసులతో చర్చించి శాంతిపజేశారు. డివిజన్ నాయకులు పెద్దెల్లి ప్రకాశ్, రవి, కనకయ్య, శకుంతల, మౌనిక, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్


నియామక ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న శంకర్

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన దేశబోయిన శ్రీనివాస్ తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం శ్రీనివాస్‌కు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ నియామక ఉత్తర్వుల పత్రం అందజేశారు. నాయకులు పంచనేని రవీందర్‌రావు, ఊట్ల సురేశ్ ఉన్నారు.

తెలంగాణ పల్లె విధ్వంస దినోత్సవం


దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో తెలంగాణ విమోచన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ ఆధ్వర్యంలో తెలంగాణ పల్లె విధ్వంస దినోత్సవం నిర్వహించారు. గొర్రె రమేశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో గ్రామాలు దుర్గంధం వెదజల్లుతున్నాయని అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రజిత, కుమార్, భానుచందర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాలకుర్తి: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లలిత తెలిపారు. ఉదయం 10గంటలకు పాలకుర్తి గ్రామ రైతువేదికలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

తహసీల్దార్ హాజరయ్యేనా?

ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి మండల తహసీల్దార్ గైర్హాజరు కావడంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి తహసీల్దార్ ఎందుకు హాజరుకావడం లేదని, ఆయన వస్తేనే సభలో ఉంటామని లేదంటే వెళ్లిపోతామని వారు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీడీవో లలిత తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా తనకు ఆఫీస్‌లో పని ఉందని, జూనియర్ అసిస్టెంట్‌ను పంపించానని సమాధానం ఇచ్చారు. దీంతో ఏకీభవించని ప్రజాప్రతినిధులు సభను మరోరోజుకు వాయిదా వేసి తహసీల్దార్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరడంతో ఎంపీడీవో సభను 16వ తేదీకి వాయిదా వేశారు. కాగా శుక్రవారం జరిగే సమావేశానికి తహసీల్దార్ హాజరవుతారా లేదా అనేది మండలంలో చర్చనీయాంశంగా మారింది.

గడ్డివాము దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మంథని: మండలంలోని సూరయ్యపల్లిలో ఆకుల రాజయ్యకు చెందిన గడ్డివాము గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. సమీపంలోనే ఇండ్లు ఉండడంతో అందరూ భయపడ్డారు. సర్పంచ్ బీమని పుష్ప వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాజయ్య తెలిపారు.

హమ్మయ్యా.. దాహం తీరింది


భగీరథ పైప్ వద్ద నీరు తాగుతున్న గోమాత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం నర్రాశాల పల్లె రోడ్డులో గురువారం మధ్యాహ్నం వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే నీటిని తాగేందుకు గోమాత పంపు వద్దకు చేరుకుని నీటి ధారతో తన దప్పికను తీర్చుకుంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. మున్సిపల్ అధికారులు దృష్టిసారించి పశువుల కోసం ముఖ్యమైన పశుసంచారం ఉన్న ప్రాంతాల్లో నీటితొట్టెలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పేదలకు అన్నదానం

సుల్తానాబాద్: తన జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్ గురువారం పేదలకు అన్నదానం చేశారు. సంఘం నాయకులు కొమురవెల్లి అంజయ్య, యువ సంకల్ప ఫౌండేషన్ నాయకులు తుమ్మ నిశాంత్, ఆశాడపు క్రాంతి, నాయకులు పూర్ణచందర్ పాల్గొన్నారు.

✦ ఉపాధి పనుల పరిశీలన

ఓదెల: మండలంలో గోపరపల్లె, లంబాడితండా, ఓదెల, కొలనూర్ గ్రామాల్లోని ఉపాధి పనులను ఎంపీడీవో సత్తయ్య గురువారం పరిశీలించారు.

✦ ఉచిత అవగాహన సదస్సు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మార్కండేయకాలనీలో పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి సహకారంతో ఇంటర్ పూర్తయి ఎంసెట్, జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్ రాసిన వారికి కంప్యూటర్ ఫ్యాకల్టీతో 17న ఉదయం 10.30గంటలకు ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అడప వనితశ్రీనివాస్ తెలిపారు.

✦ అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన ముంజంపల్లి ఈశ్వరమ్మ(45) అనే మహిళ అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుందని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఈశ్వరమ్మ రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంటకృష్ణ తెలిపారు.

✦ పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రాజాపూర్‌లో ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. కలవేన రమేశ్, సదానందం, మల్లేశ్, శ్రీకాంత్, సంపత్, సాయిలు, రాయలింగు, రాయమల్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ 2వ వార్డు పరిధిలో గురువారం పలు వీధుల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీరునిలిచే పరిస్థితులు రావొద్దనే ఉద్దేశంతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టామన్నారు. ఓదెల ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం, నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్ హన్మంతుతో పాటు నాగరాజు, జైపాల్, రవి, కోటేష్, సాగర్, రమేశ్, వెంకన్న, నర్సయ్య, శంకరయ్య పాల్గొన్నారు.



చిన్నారులతో చిరునవ్వులు చిందిస్తూ..

'పిల్లలు ఇలా రండి..' అంటూ తన ఒడిలో కూర్చుండబెట్టుకుని సరదాగా కాసేపు చిన్నారులతో ముచ్చటించారు కలెక్టర్ సంగీత. ఆ చిన్నారులు నవ్వుతూ కలెక్టర్ ఒడిలో చేరిపోయారు. పెద్దపల్లి మండలం ముత్తారంలో గురువారం పల్లె ప్రగతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఇలా పిల్లలతో కలిసిపోయారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఫొటో దిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్

గోదావరిఖని: విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 3వ డివిజన్ న్యూపోరట్‌పల్లి కమ్యూనిటీ హాల్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా విజయమ్మ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఫౌండేషన్ ద్వారా శిక్షణ అందిస్తున్న ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బుర్ర శంకర్‌గౌడ్, కుమ్మరి శారద, ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్యామ్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంట్రెన్స్ పరీక్షల ఫీజు పేరుతో 'ప్రైవేట్' దోపిడీ

జ్యోతినగర్: పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ కేంద్రంగా ఉన్న ఓ ప్రముఖ హైస్కూల్‌లో ఎంట్రెన్స్ పరీక్షల ఫీజు పేరుతో ఒక్కో విద్యార్థి పేరిట రూ.500 వసూలు చేస్తూ పరిమిత సంఖ్యలోనే సీట్లు కేటాయిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా సీట్లు ఉన్నాయని పేర్కొంటున్న స్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రవేశ రుసుం వసూలు చేసి పరీక్షలు నిర్వహిస్తూ చివరకు అర్హత సాధించలేదని ప్రకటిస్తుండడంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం చిన్న తరగతులకు ప్రవేశ పరీక్షలు నిషేధించినప్పటికీ జాతీయ స్థాయి ఐఐటీ పరీక్షలు నిర్వహించే స్థాయిలో ఆంక్షలు విధిస్తున్నారని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. ఎన్టీపీసీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సదరు విద్యా సంస్థ నిర్వాకంపై పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారి సంపత్‌రావును 'సాక్షి' వివరణ కోరగా హైస్కూల్‌లో ప్రవేశం కల్పించేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విధానం, ప్రవేశ రుసుం వసూలుపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రయివేట్ పాఠశాలలు ఫీజు వసూలు చేయాలని, ఎంట్రెన్స్ ఫీజుల పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి తెలిపారు.

కనుల పండువగా పోచమ్మ బోనాలు


జూలపల్లి: అబ్బాపూర్‌లో బోనాలతో మహిళలు


ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో గురువారం పోచమ్మ బోనాలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ ఈర్ల మల్లేశం, ఎంపీటీసీ దండె వెంకటేశం, ఉపసర్పంచ్ నాగిరెడ్డి రాజవ్వ, మాజీ సర్పంచ్‌లు టెక్కం సుధాకర్, వినోద, బొడిగె లక్ష్మీనారాయణ, ఈదుల నారాయణరెడ్డి, మాల మహానాడు నాయకులు నల్ల కనకరాజు, పత్తిపాక సింగిల్‌విండో వైస్‌చైర్మన్ పసునూటి శ్రీనివాస్, డైరెక్టర్లు సతీశ్, చంద్రయ్య, నాయకులు కొమ్మ రాజేశం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరుపల్లిలో..

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పసుపుల నాగలక్ష్మి, ఉపసర్పంచ్ రామదాసురెడ్డి, సెక్రటరీ ప్రవళిక పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి బదులు నగదు అందించాలి

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల కాపరులకు ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి బదులుగా నగదు అందిస్తే నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేసుకుంటామని గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం మండల అధ్యక్షుడు జంగ మహేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ధర్మారంలో గురువారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు అందించిన గొర్రెలతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. నేరుగా నగదు ఇస్తే నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేసుకుని ఉపాధి పొందుతారన్నారు. ధర్మారం మండలానికి రెండో విడతగా 1236 యూనిట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు పంపిణీ కార్యక్రమం ప్రారంభించలేదని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు మల్లయ్య, మల్లేశం, హన్మంతు, మహేందర్, రాయమల్లు, సంపత్, అంజయ్య, రాజేశం పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పల్లెప్రగతి దినోత్సవం

పాలకుర్తి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని గ్రామాల్లో పల్లెప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో జాతీయజెండా ఆవిష్కరించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. పుట్నూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో లలిత సిబ్బందిని సన్మానించారు. జీడీనగర్‌లో సర్పంచ్ సూర సమ్మయ్య పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో సఫాయి కార్మికులను సన్మానించారు. ఎంపీపీలు రాసకొండ లక్ష్మి, ఆరెల్లి దేవక్క పాల్గొన్నారు.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి జెండా ఆవిష్కరించగా, పంచాయతీల్లో సర్పంచులు జెండా ఆవిష్కరించారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి మానవహారం చేపట్టారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ స్రవంతి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ నాగరాజమ్మ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏవో ఉమాపతి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీపీ సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష పాల్గొన్నారు.

యైటింక్లైయిన్‌కాలనీ: సుందిల్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దాసరి లక్ష్మి జాతీయ పతాకం ఆవిష్కరించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయంపై జాతీయ జెండాను ఎంపీపీ బాలాజీ రావు ఆవిష్కరించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కొలనూర్, ఓదెల, గుంపుల, పొత్కపల్లి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో కార్మికులకు ప్రశంసా పత్రాలు అందించారు.